

# ఉత్‌రో ఉత్‌రో సావల్ రాణి

## సముద్రంలో అలలు పుట్టిన కథ

ఉత్‌రో ఉత్‌రో సావల్ రాణి ఉత్‌రో ఉత్‌రోనా
పకాయ్‌సా పక్‌వాన్ బాసీ హోగయ్
బిఛాయ్‌సా దస్తర్ ఉడ్ ఉడ్‌కొ జాతె హై
ఆయ్ సొ సగ్గె ఫిర్ ఫిర్‌కొ జాతె హై
ఉత్‌రో ఉత్‌రో సావల్ రాణి ఉత్‌రో ఉత్‌రోనా

దిగవే దిగవే సావల్‌రాణి కిందకు దిగవమ్మ
వండిన వంటలు పాసీపోయే
పరిచిన విస్తళ్లు ఎగిరెగిరిపోయే
వచ్చిన బంధువులు తిరిగి తిరిగి పోయే
దిగవే దిగవే సావల్‌రాణి కిందకు దిగవమ్మా...

ఎంతమంది బతిమిలాడినా ఆ కొత్త పెళ్లికూతురు కిందకు దిగడమే లేదు.

కింద యువరాజైన పెళ్లికొడుకు నిలబడి వున్నాడు. పెళ్లి చేయడానికి వచ్చిన ఖాజీ (పురోహితుడు) నిలబడి వున్నాడు. పెళ్లి చూడడానికి వచ్చిన బంధువులు నిలబడి వున్నారు. పెళ్లికి ఏర్పాట్లు చేసిన మహరాజు నిలబడి వున్నాడు. ఎవరు ఎన్ని రకాలుగా చెప్పినా సావల్‌రాణి దిగిరావడం లేదు. యింకాసేపట్లో పెళ్లనగా చెట్టెక్కి కూర్చుంది.

కారణం ఏమిరా అంటే - వాళ్లమ్మ, అంటే రాణిగారు ఈ పిల్ల కడుపుతో వుండగా వాళ్ల నాన్న, అంటే రాజుగారు యుద్ధానికి వెళుతూ



'మగపిల్లాడు పుడితే పాలిచ్చి పోషించు. ఆడపిల్ల పుడితే ఖబరస్తాన్‌లో పాతిపెట్టు' అని చెప్పేసి పోయాడు.

అప్పటికే రాజుగారికి ఒక కొడుకు కలిగున్నాడు. అయినాగానీ ఆడపిల్లంటే అంత మంటంట ఆ రాజుగారికి. యిదేంది దేవుడా యాయన యింత మాట అనేసి పోయాడు అని రాణిగారు భయంభయంగా రోజులు లెక్కపెట్టుకుంటా వుంటే చివరకు ఖర్మగాలి ఆడపిల్లే పుట్టింది. రాజుగారి మాటల ప్రకారం ఆ పిల్లను తీసుకెళ్లి ఖబరస్తాన్‌లో పాతిపెట్టాలి. కానీ కన్నతల్లికి మనసు రాలేదు. రహస్యంగా ఒక గుహలో పెట్టి, ఒక పరిచారికను పెట్టి కన్నతల్లెవరో, కన్న తండ్రెవరో తెలియకుండా పెంచుకుంటూ వస్తా వుంది.

ఈమెకు ఈసరికే ఒక కొడుకు వున్నాడు కదా. వాడు పెరిగి పెద్దవాడయ్యి పెళ్లీడుకు వచ్చాడు.

ఒకనాడు వాడు వేటకు పోతూ పోతూ ఈ అందాల భరిణెను చూశాడు. ఈమె కూడా వాణ్ణి చూసింది. ఇద్దరూ ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకుందాం అనుకున్నారు.

యువరాజు వెళ్లి ఈ విషయం రాజుగారికి చెప్పాడు. రాజుగారు ఆఘమేఘాల మీద పెళ్లికి ఏర్పాట్లు చేశారు.

రాణిగారికి యీ సంగతి తెలియనే తెలియదు. ఆడవాళ్లకి ఒక మాట చెప్పి చేసే రోజులా అవి? తీరా ఏర్పాట్లు జరిగిపోయి, వంటలు వండేసి, బంధువులు వచ్చేసి సగం పెళ్లి జరిగిపోయాక యింక ఉండబట్టలేక 'నాయనా, ఎవరు పెళ్లికూతురు' అని అడిగారు రాణిగారు.

'అమ్మా. ఫలానా గుహలో వున్న ఫలానా అమ్మాయి. ఆమెకు అమ్మా నాన్నా లేరు. పిల్ల గుణవంతురాలు. చేసుకుంటున్నాను' అన్నాడు యువరాజు.

రాణిగారి వంట్లో రక్తం చల్లబడింది.

తోడబుట్టిన అన్న తోడబుట్టిన చెల్లెల్ని చేసుకుంటే యింకేమైనా ఉందా? ఈ విషయాన్ని కొడుకుతో చెప్పినా, భర్తతో చెప్పినా ఆమె తలా ఆమె కూతురి తలా నరికిపారేస్తారని భయపడి గబగబా పరిగెత్తింది కూతురి దగ్గరకు.

పరిగెత్తి, సంగతి చెప్పి, ఏడ్చి, గుండెలు బాదుకుని 'అమ్మా, నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నీ అన్నతో ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు' అంది.

ఆమె ఆ మాటలు అంటున్న టైముకి ఆ పిల్ల యిత్తడి చెంబులో నీళ్లు తీసుకుని, సవక (సరుగుడు) చెట్టు కింద కూర్చుని, నమాజు కోసం వజూ (కాళ్లూ చేతులూ కడుక్కోవడం) చేసుకుంటోందంట.

ఎప్పుడైతే తల్లి ఈ మాట చెప్పిందో అప్పుడే ఆ చెంబులోని నీళ్లు కింద పారేసి గబగబా సవక చెట్టు ఎక్కి కూర్చుంది. యింక అక్కడి నుంచి కిందకు దిగలేదు.

పెళ్లివారందరూ అక్కడికి వచ్చారు. చెప్పారు. బుజ్జగించారు. కారణం అడిగారు. బతిమిలాడారు.

సావల్‌రాణి మాత్రం కిందకు దిగిరావడం లేదు. ఆమె ప్రేమలో పిచ్చివాడైపోయిన అన్న యింక చూసి చూసీ 'ఉండండి. నేను చెట్టెక్కి లాక్కొస్తాను' అని చెట్టెక్కాడు.

వాడు పైకి రాను. సావల్‌రాణి యింకాస్త పైకి ఎక్కను.

వాడు పైకి రాను. సావల్‌రాణి ఇంకాస్త పైకి ఎక్కను. అలా ఎక్కుతూ ఎక్కుతూ వుండేసరికి - కింద ఈ పిల్ల పారేసింది కదా యిత్తడి చెంబులోని నీళ్లు - అవి సముద్రమయ్యాయి.

కొసాకు వెళ్లిన సావల్‌రాణి ఆ సముద్రంలో దూకి అలగా మారింది. అది మొదటి అల. చెల్లెలి అల.

వెనకే వచ్చిన అన్న కూడా దూకి అలగా మారాడు. అది రెండవ అల. అన్న అల.

ఆనాటి నుంచి ఈనాటి వరకూ సముద్రంలో చెల్లెలి అలను అందుకోవడానికి అన్న అల దబదబమని పరుగు తీస్తూనే వుంది. అయినాగానీ చెల్లెలి అల అన్నకు అందడం లేదు.

ఏనాడైతే ఆ అల ఈ అలకు అందుతుందో ఆ రోజున ప్రళయం వచ్చి లోకం అంతరిస్తుందని పెద్దలు చెబుతారు.